క్లుప్తంగా

సాంస్కృతిక ప్రదర్శనల ఎంపిక


ఎంపికలు నిర్వహిస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 26న కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జరగనున్న గణతంత్ర వేడుకల్లో ప్రదర్శించనున్న సాంస్కృతిక కార్యక్రమాల ఎంపికలు గురువారం బస్టాండ్ సెంటర్‌లోని చిల్డ్రన్స్ పార్క్‌లో నిర్వహించారు. ఆహుతులను అలరించే విధంగా ప్రదర్శనలు ఉండేందుకు వివిధ పాఠశాలల విద్యార్థులను ఆహ్వానించారు. ఈ ఎంపికలో డీవైపీఎం కే.శివకుమార్, కమ్యూనికేషన్ ఆఫీసర్ టి.శ్రీనివాసరావు, మేనేజ్‌మెంట్ ట్రైనీ కే.ఉదయ్‌కుమార్, సేవా కోఆర్డినేటర్ ఇజాజ్ షరీఫ్, స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు.

వేతనాలు జమ చేయండి..

టేకులపల్లి: రాష్ట్రంలో సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు ఈనెల 21 నుంచి 31 వరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం సీఆర్పీలు బడి బయటి పిల్లలను గుర్తించనున్నారు. ఇందులో భాగంగా గురువారం టేకులపల్లి మండలంలో ఉన్న ఆరు కాంప్లెక్స్ సీఆర్పీలు బడి బయట పిల్లల్ని గుర్తిస్తున్నారు. ఈ క్రమంలో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ సందర్భంగా సీఆర్పీలు మాట్లాడుతూ... సమ్మె కాలంలో ఉన్న పెండింగ్ పనులన్నీ చేయిస్తున్నారు కానీ, జీతం మాత్రం ఇవ్వట్లేదని రెండు నెలలుగా జీతం లేక ఇల్లు గడవక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం స్పందించి జీతాలు జమ చేయాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు డిమాండ్ చేశారు.

పీవైఎల్ కమిటీ ఎన్నిక



టేకులపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో రెండు విప్లవ యువజన సంఘాలు గురువారం ఐక్యత విలీన సభ నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. టేకులపల్లికి చెందిన నోముల భానుచందర్‌ను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

ఎన్‌సీసీ కోర్సు ప్రారంభించండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్‌సీసీ కమాండర్ నవీన్ యాదవ్ గురువారం సింగరేణి మహిళా జూనియర్ కళాశాల సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఎన్‌సీసీ ప్రాధాన్యం గురించి వివరించారు. అనంతరం సింగరేణి మహిళా జూనియర్ కళాశాలలో ఎన్‌సీసీ కోర్సు ప్రారంభించాలని ప్రిన్సిపాల్ సంధ్యారాణి యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రజాపాలనలో మోసపోతున్న ప్రజలు


మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: గ్రామసభలు ఎవరిని మోసం చేయడానికి నిర్వహిస్తున్నారని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని, ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఇప్పుడు గ్రామ సభలంటూ కొత్త నాటకానికి తెరలేపారని ఆరోపించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని అర్థం అవుతోందన్నారు. గతంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ అంటూ.. ఇంటింటి సర్వే అంటూ.. కొన్ని రోజులు హడావుడి చేశారని విమర్శించారు. గ్రామసభల్లో రాజకీయ నాయకుల హడావుడి తప్ప ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు.

నాణ్యమైన విత్తనాలనే అందించాలి

టేకులపల్లి: అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలనే డీలర్లు రైతులకు సరఫరా చేయాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు గురువారం కోయగూడెంలోని శ్రీ విఘ్నేశ్వర ట్రేడర్స్ ఆధ్వర్యంలో మిర్చి పంట క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించారు. మయూరి సీడ్స్ కావ్య 44 మిర్చి విత్తనాలతో అధిక దిగుబడి సాధించిన రైతు సంపటి వెంకన్న పంట క్షేత్రాన్ని రైతులు, డీలర్లు, కంపెనీ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా అధిక దిగుబడి సాధించిన యువ రైతు సంపటి వెంకన్నను సన్మానించి అభినందించారు. మండల కేంద్రంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు గురించి ఆలోచిస్తామన్నారు. మయూరి సీడ్స్ కావ్య 44 మిర్చి విత్తనం నల్లి, వైరస్‌ను తట్టుకుని కాయ సైజు పెద్దగా బరువుగా ఉంటుందని తద్వారా ధర కూడా పెరుగుతుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో మయూరి సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ జనార్ధన్, శ్రీ విఘ్నేశ్వర ట్రేడర్స్ యజమాని గంగారపు శ్రీనివాస్, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.


పాల్వంచరూరల్: గ్రామసభకు హాజరైన ప్రజలు



ఇల్లెందు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య


జూలూరుపాడు: మాచినేనిపేట తండాలో నిరసన..

అర్హుల జాబితా తప్పులతడక

- చివరి రోజూ ఆగ్రహించిన ప్రజలు
- గ్రామసభల్లో వెల్లువెత్తిన అభ్యంతరాలు

మళ్లీ దరఖాస్తు చేసుకోండి..


మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ డీవీ

ఇల్లెందు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని, అర్హుల జాబితాలో పేర్లు లేనివారు వెంటనే ధరఖాస్తు చేసుకుంటే వారికి కూడా న్యాయం చేస్తామని ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు సూచించారు. పట్టణంలోని పలు వార్డులలో గురువారం వార్డు సభలలో వారు ప్రసంగించారు. అనర్హుల పేర్లు తొలగించి అర్హులందరికీ న్యాయం జరిగేలా ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన విధంగా ఆరు గ్యారెంటీలను అమలు చేయడం కోసం పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక నిర్వహిస్తోందనడానికి తాజాగా ప్రకటించిన అర్హుల జాబితా నిదర్శనమని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా కొన్ని చోట్ల తమ పేర్లు రాలేదని పలువురు లబ్ధిదారులు మళ్లీ దరఖాస్తులను అందజేశారు. మునిసపల్ వైస్ చైర్మన్ జానీపాషా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అధిక సంఖ్యలో హాజరైన ప్రజలు ..


కొమరారంలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

ఇల్లెందురూరల్: మండలంలోని ఆరు గ్రామపంచాయతీలలో గురువారం గ్రామసభలు కొనసాగాయి. కొమరారంలో గ్రామసభకు అధిక సంఖ్యలో హాజరైన ప్రజలు అధికారులకు ప్రశ్నల వర్షం కురిపించారు. భవనాలు, పక్కా నిర్మాణాలతో సొంతిల్లు ఉన్న వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు, ఒకే ఇంట్లో ముగ్గురు, నలుగురికి రేషన్‌కార్డులు మంజూరు చేశారని ఆరోపించారు. ఉపాధి కూలీలకు సగం మందికి కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలో చోటు దక్కలేదని నిరసన వ్యక్తం చేశారు. అభ్యంతరాలను ఉన్నతాధికారులకు వివరించి అందరికీ న్యాయం చేస్తామని గ్రామసభ ప్రత్యేకాధికారి సతీష్ హామీ ఇచ్చారు. పలు గ్రామాలలో నిర్వహించిన గ్రామసభలకు తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ధన్‌సింగ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అర్ధాంతరంగా ముగిసిన గ్రామసభ..


బస్వతారక కాలనీలో రీసర్వే చేస్తున్న అధికారి

పాల్వంచరూరల్: ప్రజాపాలన గ్రామసభలు మూడో రోజు కూడా ప్రజలు అర్హులైన నిరుపేదలకు ఇళ్లు, రేషన్‌కార్డుల అర్హుత జాబితాలో పేర్లు లేవని ఆందోళన నిర్వహించారు. కిన్నెరసాని, సూరారంలో స్థానికులు వాగ్వాదానికి దిగడంతో అధికారులు మధ్యలో లేచిపోయారు. కొత్తసూరారం, మందేరకలపాడు, నాగారంకాలనీ, కోడిపుంజుల వాగు, సూరారం, సత్యనారాయణపురం, రంగాపురం, కిన్నెరసాని, తవిశలగూడెం, కారెగట్టు, తోగ్గూడెం, యానంబైల్ గ్రామాల్లో గురువారం అధికారులు ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు... బస్వతారక కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరిగాయని స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రీ సర్వే నిర్వహించాలని ఆదేశాలు రావడంతో గురువారం పంచాయతీ అధికారి సుబ్రమణ్యం రీ సర్వే చేశారు.

ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం..

ప్రతి నిరుపేద కుటుంబంతోపాటు అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందించాలనేదే ప్రభుత్వ ధ్యేయమని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. కొత్తసూరారం లో గురువారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన మాట్లాడారు. అర్హుల జాబితాలో పేర్లు రానివారు కొత్తగా దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి పథకాలు అందజేస్తారని పేర్కొన్నారు. ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, నాయకులు మహేష్, కొండం వెంకన్న, సొసైటీ డైరెక్టర్ కిషన్, మాజీ సర్పంచ్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై ఆగ్రహం..


మాట్లాడుతున్న ఎంపీఓ శ్రీనివాసరావు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల, గట్టుమళ్ల గ్రామ పంచాయతీలో గురువారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డుల లబ్ధిదారుల జాబితాను అధికారులు చదివి వినిపించారు. అనంతరం రేగళ్ల గ్రామసభలో మృతి చెందిన వారి పేర్లు ఆత్మీయ భరోసా పథకంలో వచ్చాయంటూ స్థానికులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన అధికారులు జాబితాలో పేర్లు రానివారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని, అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు శాంతించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాసరావు, ఆర్ఐ శంకర్, ఏఈఓ లత, పంచాయతీ కార్యదర్శి వంశీ కృష్ణ, పంచాయతీ ప్రత్యేక అధికారి వెంకటస్వామి, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు తదితరులు ఉన్నారు.

గ్రామసభల్లో రసాభాస..


గ్రామసభలో అభ్యంతరం వ్యక్తం చేస్తున్న ప్రజలు

జూలూరుపాడు: ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పథకాల లబ్ధిదారుల ఎంపికకు నిర్వహించిన గ్రామసభలు గురువారం ముగిసాయి. మూడో రోజు జూలూరుపాడు, పాపకొల్లు, గుండ్లరేవు, మాచినేనిపేటతండా, కాకర్ల గ్రామసభల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. జూలూరుపాడు గ్రామసభలో అర్హులకు న్యాయం జరగలేదంటూ కొందరు మహిళలు బైఠాయించి కంటతడి పెట్టుకున్నారు. గ్రామసభ ముగించుకొని ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి వెళ్తుండగా తమకు న్యాయం చేసి వెళ్లాలంటూ అడ్డుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కరుణాకర్ రెడ్డి, తహసీల్దార్ స్వాతి బిందు, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనా రెడ్డి, ఎస్సై బి రవి, ఏఓ దీపక్ ఆనంద్, ఎంపీఓ తులసిరామ్, ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, ఏఈఓలు విజయభాను, సరిత, గోపీక్రిష్ణ, గౌస్, ఆర్ఐ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు. వెంగన్నపాలెం గ్రామసభలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలపై సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ, బీఎస్పీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

కొత్తగూడెం పట్టణంలో...


మాట్లాడుతున్న కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి

కొత్తగూడెంఅర్బన్: మూడో రోజు గురువారం మున్సిపాలిటీలో 9, 10, 13, 14, 20, 21, 23, 24, 27, 28 వార్డులో సభలు జరిగాయి. ఇందిరమ్మ ఇళ్లకు లిస్ట్‌లో పేరు రానివారు అధికారులు, వార్డు కౌన్సిలర్లను నిలదీశారు. స్పందివచిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు.

ఎంపికలో అవకతవకలు..

సుజాతనగర్: గరీబ్‌పేట, సర్వారం, సీతంపేట బంజర, రాఘవాపురం గ్రామాల్లో గురువారం నిర్వహించిన గ్రామసభలు రసాభాసగా మారాయి. ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా పథకాల ఎంపికల్లో అవకతవకలు జరిగాయని స్థానికులు వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రజలు వాగ్వాదానికి దిగారు. సుజాతనగర్‌లో జరిగిన గ్రామసభలో కార్పొరేషన్ విలీనంపై తీవ్ర నిరసన వ్యక్తం అయింది. పల్లె ప్రాంతాలే ముద్దు, కార్పొరేషన్ వద్దు, 7 గ్రామ పంచాయతీలను కొత్తగూడెం కార్పొరేషన్‌లో విలీనం చేయొద్దంటూ సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేకపోవడంతో కొందరు దరఖాస్తులను చించివేశారు.


మాట్లాడుతున్న కార్యదర్శి చెన్నకేశవరావు

25న ఆకాశవాణిలో కవిత 'ఇంద్రధనుస్సులు'

చుంచుపల్లి: కవిత 'ఇంద్రధనుస్సులు'ఈ కార్యక్రమ ప్రాంతీయ భాషా అనువాదాలు ఆకాశవాణి వివిధ స్టేషన్ల ద్వారా ప్రసారం కానున్నాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రసారమయ్యే ఈ కార్యక్రమాన్ని వివిధ ప్రాంతీయ భాషల్లో జనవరి 25వ తేదీ రాత్రి 10 గంటలకు దేశ వ్యాప్తంగా అన్ని ఆకాశవాణి కేంద్రాలు ప్రసారం చేస్తాయని ఆకాశవాణి హైదరాబాద్ కేంద్ర కార్యక్రమ విభాగాధిపతి కేవీఎల్. శ్రీనివాసరెడ్డి, కొత్తగూడెం స్టేషన్ హెడ్ బైరి శ్రీనివాసన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వ భాషా కవి సమ్మేళనం తెలుగు అనువాదాన్ని ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం, స్థానిక ఆకాశవాణి కేంద్రాలు, ఎఫ్ఎం, చానళ్లు, తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాలు ప్రసారం చేస్తాయని పేర్కొన్నారు.

ఈ ఏడాది లక్ష్యాలు సాధిస్తాం: సింగరేణి జీఎం


మాట్లాడుతున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): ఈ ఏడాది సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించిన 149.05 లక్షల టన్నుల బొగ్గు వార్షిక లక్ష్యాలను 100శాతం సాధిస్తామని ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు అన్నారు. గురువారం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది వర్షాల వలన ఉత్పత్తిలో కొంత వెనుకంజలో ఉన్నప్పటికీ ప్రణాళికతో రానున్న మూడు నెలల్లో లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. ఇప్పటి వరకు 112.24 లక్షల టన్నుల లక్ష్యానికి 110.19 లక్షల టన్నులు 98శాతం సాధించి సింగరేణి వ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏజీఎం రామకృష్ణ, డీజీఎం పర్సనల్ శివకేశవరావు, కిష్టారం ఓసీ పీఓ రమణారావు, జీకే ఓసీ పీఓ శ్రీరమేష్, ఐఈడీ యోహాన్, సుమలత, ఎస్ఎస్ఓ వి.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలను ఆదుకోవాలి

కొత్తగూడెంటౌన్: చిట్టి రామవరం తండా రైతు కూలీలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని గిరిజన సంఘం జేఏసీ నాయకులు శ్రీనివాస్‌నాయక్, రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం తండాలో జరిగిన గిరిజన జేఏసీ నాయకుల సమావేశంలో సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, జేఏసీ నాయకులు రాజ్‌కుమార్ మాట్లాడారు. అధికారిక లెక్కల ప్రకారం చిట్టి రామవరం తండాలో 330కి పైగా కుటుంబాలు ఉన్నట్లు చెప్పారు. తండాలోని ప్రతీ వ్యవసాయ కూలీకి ఆత్మీయ భరోసా పథకం, ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే అధికారులు, ప్రజా ప్రతినిధులను నిలదీస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పూర్ణచందర్, భాస్కర్‌నాయక్, సీతయ్య, శ్రీను, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నగరాలకు దీటుగా 'గూడెం' అభివృద్ధి

కొత్తగూడెంఅర్బన్: నగరాలు, మహానగరాలకు దీటుగా కొత్తగూడెం పట్టణాన్ని అభివృద్ధి చేసి మెరుగైన సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయి ఆవాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 11వార్డుల్లో రూ.6.32కోట్ల డీఎంఎఫ్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. కొన్ని పూర్తయిన పనులను ప్రారంభించారు. కూనంనేని మాట్లాడుతూ.. పారిశ్రామిక ప్రాంతం గిరిజన పల్లెలకు కేంద్రంగా ఉన్న కొత్తగూడెంను సుందర పట్టణంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. విద్య, వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఇక ఉండదన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, నూతన పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థల ఏర్పాటు కానున్నట్లు చెప్పారు. విమానాశ్రయం ఏర్పాటుకు తొలి అడుగుపడిందని, సంబంధిత పనుల వేగవంతం కోసం ప్రభుత్వంపై వత్తిడి తెస్తానన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, ఛైర్‌పర్సన్ సీతాలక్ష్మి, తహసీల్దార్ పుల్లయ్య, కమిషనర్ శేషాంజన్‌స్వామి, డీఈ రవికుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళి


ఇల్లెందురూరల్: డిగ్రీ కళాశాలలో నేతాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు


కొత్తగూడెంరూరల్: త్రివేణి స్కూల్‌లో..

ఇల్లెందురూరల్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతిని మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య మాట్లాడుతూ.. నేతాజీ అచంచల దేశభక్తికి ప్రతిబింబం అని కొనియాడారు. నాడు ఆయన చేసిన ఆలోచన మహోన్నతమైందని, నేతాజీ జీవితం నుంచి దేశభక్తి, ధైర్య సాహసాలను విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి.శేఖర్, రాజు, ప్రభాకర్‌రావు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ రాకేష్ శ్రీరాం, డాక్టర్ వెంకటేశ్వరరావు, బి.సరిత, సురందర్, శ్రీకాంత్, లక్ష్మణ్‌రావు, సుజాత, ఇమామ్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి పాఠశాలలో..

కొత్తగూడెంరూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోష్ 128 వ జయంతి వేడుకలను లక్ష్మీదేవిపల్లి మండలంలోని త్రివేణి పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల డైరెక్టర్ వీరేంద్రచౌదరి మాట్లాడుతూ.. స్వరాజ్య స్థాపనకై ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి స్వరాజ్యాన్ని సాధించారని, ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలన్నారు.

పాల్వంచ: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి పురస్కరించుకుని నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నేతాజీ చిత్రపటానికి జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ జి.భానుమతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోగులకు పండ్లు, బ్రెడ్ అందిజేశారు. కార్యక్రమంలో ఎస్‌జేకే అహ్మద్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంప్రసాద్, ఆర్ఎంఓ డాక్టర్ సోమరాజుదొర, డాక్టర్ నామా బుచ్చయ్య, రాజమల్లు, సయ్యద్ అక్బర్, రాఘవ, అబ్దుల్ రజాక్, స్టాలిన్, రావూఫ్, భిక్షం, ప్రకాష్, శ్రీరామ్, సత్యం, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్

ఇల్లెందు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయాలని, ఆరు గ్యారంటీలు జాప్యం చేయకుండా అమలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 20న ఎన్డీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు ఎన్డీ ప్రకటించింది. గురువారం ఇల్లెందులో ఎన్డీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ విజయవంతానికి ముద్రించిన కరపత్రాలను, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. గౌని నాగేశ్వరరావు, సీతారామయ్య, తుపాకుల నాగేశ్వరరావు, ఉమర్, రంగయ్య, ప్రసాద్, నర్సింహారావు, సారంగపాణి, తోడేటి నాగేశ్వరరావు, ఎండీ రాసుద్దీన్ పాల్గొన్నారు.

దివ్యాంగ ఉద్యోగ సంఘం కార్యదర్శిగా లక్ష్మానాయక్



టేకులపల్లి: దివ్యాంగ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శిగా టేకులపల్లి మండలం వాగొడ్డు తండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బాణోత్ లక్ష్మానాయక్ ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం మాట్లాడుతూ.. కొత్తగూడెంలో జరిగిన సదస్సులో తనను ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లాలో దివ్యాంగ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సీసీ కెమెరాల వితరణ


కెమెరాలను పరిశీలిస్తున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు రాజ్ మహ్మద్ జాన్‌బీ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఎండీ రజాక్ బ్రదర్స్, సంస్థ అధ్యక్షుడు పాషా జునైద్ గురువారం సీసీ కెమెరాలను వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏరియా జీఎం ఎం.శాలేంరాజు, టూ టౌన్ సీఐ రమేష్ కుమార్ హాజరయ్యారు. ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాసరావు, రాజయ్య, గోపి కుమార్, సమ్మయ్య పాల్గొన్నారు.

కార్మికులపై వివక్ష గర్హనీయం

పాల్వంచ: టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలలో పనిచేస్తున్న సుమారు 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు జె.సీతారామయ్య అన్నారు. స్థానిక కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని గురువారం ఇఫ్టూ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. సీతారామయ్య మాట్లాడుతూ... స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారం ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతీ ఆర్టిజన్ కార్మికుడికి ఇంక్రిమెంట్, గ్రేడ్ ప్రమోషన్ ఇవ్వాలని, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతూ ఆందోళన బాట పట్టినా రేవంత్‌రెడ్డి పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. చదువుకు తగ్గ పోస్టులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం చర్చలకు పిలిచి ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గౌని నాగేశ్వరరావు, ఎర్నం శ్రీను, ఎస్.భాస్కర్, కె.నరసింహారావు, కృష్ణ, శ్రీను, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


నిలిచిన రోడ్డు నిర్మాణ పనులు

- కంకరపై నడక యాతన
- దెబ్బతింటున్న వాహనాల టైర్లు
- పట్టించుకోని అధికారులు


కంకర పోసి వదిలేసిన తెలగరామవరం - మదార్ తండా రోడ్డు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం తెలగరామవరం నుంచి మదార్ తండా వరకు తారు రోడ్డు నిర్మాణ నిలిచిపోయాయి. పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో రూ.80 లక్షల నిధులతో గత జూన్‌లో ఈ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. రోడ్డంతా కంకర పరిచి పనులు నిలిపివేశారు. దీంతో ఈ రోడ్డు గుండా రాకపోకలు కొనసాగించే వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనాలు, ఆటోలకు పంక్చర్లు అవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డుకు ఇరువైపుల పొలాలు ఉన్నాయి. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఇల్లెందు నుంచి కారుకొండ మీదుగా తెలగ రామవరం నుంచి మదార్‌తండా మీదుగా సర్వారం వెళ్లే ఈ రోడ్డు మధ్యలో నిలిచిపోవడంతో ఆయా వాహనదారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇల్లెందు నుంచి బొమ్మనపల్లి, కారుకొండ మీదుగా తెలగ రామవరం నుంచి మదార్ తండా తారు రోడ్డు నిర్మాణం జరిగితే సర్వారం, ఖమ్మం రోడ్డు మీదుగా 10 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. పైఅధికారులు స్పందించి తారురోడ్డు నిర్మాణం త్వరగా అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి..



గత సంవత్సరం పనులు ప్రారంభించి, మధ్యలోనే వదలి వెళ్లారు. తెలగరామవరం నుంచి మదార్ తండా వరకు ఆగిపోయిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి. కంకర మీద నడవడం, వాహనాలు వెళ్లడం ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. – చంద్రగిరి హరికృష్ణ

అంత నిర్లక్ష్యమెందుకు ?



తెలగరామవరం నుంచి మదార్ తండా వరకు రెండు కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణం పనులు మధ్యలోనే నిలిపివేశారు. కంకర మీదుగా వాహనాలు వెళితే పంక్చర్లు అవుతున్నాయి. రైతులు పొలాలకు వ్యవసాయ పనిముట్లు తీసుకెళ్లడం ఇబ్బందిగా ఉంది. అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదు. – యాసారపు నర్సింహారావు